# మనుషులమవుదాం!

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 1-9-1995

బస్సు వస్తున్నదంటే చాలు, ఒకటే గోల, అరుపులు, కేకలు, తొక్కిసలాట, కుమ్ములాట

ఆడ, మగ భేదం లేదు. పిల్ల పెద్ద తేడా లేదు. జాలి, సానుభూతి అనే పదాలకు ఆస్కారమే లేదు.

తోసుకుంటూనో తొక్కుకుంటూనో, బస్సు ఎక్కాలి. సీటు సంపాదించాలి అదీ కిటికీ పక్కనే అయితే ఏరీ హాయి.

బస్సుకు అభిముఖంగా పరుగెత్తి కిటికీ చువ్వల సాయంతో పైకి ఎగబ్రాకి కండువానో, కర్చీఫో సీట్లో పడేసేవారు కొందరు. బస్సు ఆగీ ఆగక ముందే తలుపు మీద పడిపోతున్నారు.

"వెనక్కి వెళ్లండి తలుపు తెరవనీయండి" అంటూ కండక్టరు అరుపులు.

డ్రైవరు సీటు పక్క కిటికీ గుండా కొందరు బుట్టలు, సంచులు లోపలికి పంపుతున్నారు చిన్న చిన్న పిల్లల్ని కూడా అటుగుండానే ఎక్కిస్తున్నారు.

ఆ తొక్కిసలాటలో వెళ్ళడానికి సాహసించలేక పోయాన్నేను. మరో బస్సుకో, మరో బస్సుకో వెళ్ళచ్చు లెమ్మనుకుని బస్టాండ్‌లో ఆ భాగవతం చూస్తూ నిల్చుండిపోయాను.

బస్సు వచ్చిన అయిదు నిమిషాలలోనే జనంతో కిక్కిరిసి పోయింది బస్సు. ఆ జనంలో గుండా కండక్టర్ ఎలా బస్సు వెనక సీటు దాకా వెళ్తాడో అర్థం కాలేదు నాకు. అతడు పడబోయే అవస్థ గురించి కాసేపు ఆందోళన పడ్డాన్నేను. అతగాడి మీద మనసులోనే జాలిపడ్డాను.

అంతలోనే ఆ బస్సు వెళ్ళిపోయింది. మరో బస్ వచ్చింది మళ్ళీ అదే తంతు. నేనలాగే వుండిపోయాను.

మా స్నేహితుడు ఒకతనికి యాక్సిడెంట్ అయిందని. హాస్పిటల్‌లో చేర్చారని టెలిగ్రాం రావడంతో అతన్ని పరామర్శించి రావటానికి బయల్దేరాన్నేను.

అతని పరిస్థితి ఎలా వుందోనన్న ఆందోళనగావున్నా మరో రెండు బస్సులు వచ్చి వెళ్ళాక ఇక ఉపేక్షించలేక అప్పుడే వచ్చి ఆగిన ఇంకో బస్సులోకి అతి కష్టం మీద ప్రవేశించగలిగాన్నేను.

కండక్టర్ సీటు వెనక వైపు అయిదో వరసలో నాకు సీటు కూడా దొరకడంతో విశ్రాంతగా కూర్చున్నాను. రెండు గంటల ప్రయాణం.

మిత్రుడి గురించి ఆలోచిస్తున్న నాకు హఠాత్తుగా అరుపులు, కేకలు వినపడినై. అటుగా చూశాను ఎవరో ఇద్దరు వ్యక్తులు సీటు గురించి తగూ పడ్తున్నారు

"కండవా వేశాను. కన్పించడంలా" గద్దిస్తూ అన్నాడు నల్లగా పొడుగ్గావున్న ఓ వ్యక్తి పంచకట్టుకుని, పొడుగు చేతుల తెల్లచొక్కా తొడుక్కున్నాడు.

"నేను ఎక్కేసరికి నీ కండవాలేదు. నే కూర్చున్నా" మొండిగా చెప్పేడు సీట్లో కూర్చున్న మరొకతను. గళ్ళ పేంటు టీ షర్టు వేసుకున్నాడతను.

"అయితే కండవాకి కాళ్ళు వచ్చినయ్ కాబోలు" ఉక్రోషంగా అడిగాడు పంచ కట్టుకున్నతను.

విననట్లు కూర్చుండిపోయాడు పేంటువాలా.

"చదువుకోంగానే సరికాదు.... బుద్ధుండాల" ........

"సిగ్గు లేని నా...."

"మాటలు మీరేవంటే నాలుక్కోసేస్తా.... ఏమనుకుంటన్నావో ఆవేశంగా సీట్లోంచి లేచాడు గళ్ళ షర్టతను.

మాటలు దాటి చేతులు పైకి లేచనై. ఒకళ్ళ చొక్కా ఒకరు పట్టుకుని లాగటం మొదలు పెట్టారు.

తంతానని ఒకడంటే పొడుస్తానని ఒకడన్నాడు. అంతదాకా వచ్చేసరికి నలుగురయిదుగురు కలగచేసుకుని సర్ది చెప్పేరు. బల వంతాన ఇద్దర్నీ విడదీసి దూరం చేశారు.

డ్రైవరు, కండక్టరూ వచ్చారు. బస్సు కదిలింది మరో పది నిమిషాల వరకూ ఆ ఇద్దరూ ఎవరికి వారే పక్కవారితో ఏవేవో చెప్పుకుంటున్నారు.

వూరు దాటే ముందు బస్సు ఆగిపోయింది పావుగంటలోపు గానే టిక్కెట్లు ఇచ్చే కార్యక్రమం పూర్తిచేశాడు కండక్టర్. బస్సు వేగంగా కదిలింది.

"బస్సులో సీటు కోసం ప్రాణాలు తీసుకునేవరకు వచ్చారు... చూడండి.... ఏం మనుషులో.... ఏం ఆవేశాలో.... అర్థం లేని తగూలు" రహస్యంగా నాకు మాత్రమే వినిపించేటట్లు అన్నాడు నా పక్కన కూర్చున్న మనిషి.

నా అభిప్రాయం ఏమిటో అర్థంకాని విధంగా తలాడించాను. ఆ విషయం గురించి సంభాషించడం ఇష్టం లేదన్నట్టుగా చేతిలో వారపత్రికను తెరిచాను

అర్థం చేసుకున్నట్టున్నాడు పక్క వ్యక్తి. మౌనంగా కళ్ళు మూసుకుని సీట్లో వెనక్కి వాలాడు.

వేగంగా వెళ్తున్నది బస్సు. కిటికి పక్కనే కూర్చున్నందువల్ల గాలి చల్లగా తగుల్తున్నది. హాయిగా కళ్ల మూతలు పడ్డయ్ నాక్కూడా

అర్థాంతరంగా పెద్ద శబ్దం చేస్తూ బస్సు ఆగిపోయింది. ఆ శబ్దానికి నిద్రాభంగం కలిగింది నాకు. కళ్లు తెరచి చూసేసరికి అసంఖ్యాకంగా నిలచి వున్న వాహనాలు కనపడినై. ఓ రెండు, మూడు నిమిషాలకే మా బస్సు వెనక ఇంకా కొన్ని బస్సులు, కార్లు వగైరా ఆగిపోయినై.

స్కూటర్‌వాలాలు, ద్విచక్ర వాహనాల వారందరూ దారి చూసుకుని దూసుకుపోతున్నారు. ముందుకు అప్పుడే వచ్చిన వాహనాలవారు హారన్లు మోగించడం మొదలు పెట్టారు

బస్సులోంచి ఒక్కొక్కరే దిగడం మొదలు పెట్టారు. డ్రైవరు కూడా దిగడంతో బస్సులో నుంచి దాదాపు సగం మంది పైగా దిగేశారు నేను కూడా వాళ్ళ ననుసరించాను కాలక్షేపం కోసం, కాళ్ళ తిమ్మిర్లు తగ్గించుకోవడం కోసం.

ట్రాఫిక్ ఆగిపోయిన కారణం ఆ చెవిన, ఆ చెవిన పడి నా చెవికి పాకింది

ఆ వూళ్ళో గత మూడు రోజులుగా మున్సిపల్ కుళాయిల్లో నీరు రాని కారణంగా ప్రజానీకం సౌకర్యార్థం వాటర్ టాంకుల్లో నీరు సరఫరా చేస్తున్నారట.

మూడు రోజులుగా నీళ్ళకు కరువు పడ్డ ప్రజలు బిందెలు చేత పుచ్చుకుని టాంకర్ దగ్గరకు పరుగులు పెట్టారు.

కథ మామూలే. మళ్ళీ బస్టాండ్ దగ్గర భాగవతమే తోసుకోవటాలు. త్రొక్కిసలాటలు.

అరుపులు-కేకలు-తిట్లు-శాపనార్థాలు.

వాటికి తోడు బిందెల మోతలు.

అన్నింటిని అధిగమించి పోట్లాట కొట్లాట దాకా చేరుకున్నదట

ఆ కొట్లాటలో ఆవేశం ఎక్కువైపోయి వూడిన జడ ముడిని

పట్టించుకోకుండా అపరకాళిలా, అవతల వ్యక్తి మాడు మీద ఇత్తడి బిందెతో బాదిందట ఒక వీర వనిత.

ఎదురు దాడిగా బిందె దెబ్బ తిన్న మనిషి ఉగ్రురాలై అమాంతం ఆమె గొంతు పుచ్చుకుని కసిగా పిసికిందట. ఎలాంటి పట్టు చిక్కిందో చచ్చూరుకుంది ఆ ప్రాణి.

అంతే. ఏడుపులు, కేకలు ఆ ప్రదేశమంతా భయానకంగా మారిపోయింది.

ఎండిపోతున్న గొంతులు గుర్తుకు రాలేదు. పిడచ కట్టుకుపోతున్న నాలుకలూ గుర్తుకు రాలేదు. సగంపైగా పరుగు లంకించుకు పారిపోయారు

మిగిలిన వాళ్ళంతా చోద్యంచూస్తూ నిలబడ్డారు.

గుంపులోంచి రకరకాల కామెంట్లు ప్రారంభమైనయ్.

చంపిన మనిషి వణికిపోతూ విరుచుకుని వెనక్కుపడిపోయింది.

అదంతా నాటకం అన్నారట కొందరు. చంపెయ్యండి దాన్ని కూడా అంటూ ముందుకురికారట కొందరు.

టాంకర్లో నీళ్ళు రోడ్డుమీద కారిపోతున్నై. నీళ్ళను ఎవరూ పట్టించుకోలేదు.

ఊరుఫూరంతా కదిలివచ్చారు. పోలీసులు వచ్చారు. రోడ్డంతా జన సందోహం ...ఆ కారణంగా వాహనాలన్నీ ఆగిపోయినయ్.

మరి కాసేపటికి ఇంకొందరు పోలీసులు, పై అధికారులూ కూడా వచ్చారు.

మెల్లగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేశారు వాహనాలు ఒక్కొక్కటీ కదలసాగాయి. వందల సంఖ్యలో ఆగిపోయిన వాహనాలు అన్నీ అక్కడ్నుంచి కదిలి వెళ్ళేసరికి నా ప్రయాణం మామూలుకంటే మరో రెండు గంటలు అదనంగా కొనసాగింది.

బతుకుజీవుడా అనుకుంటూ బస్సు దిగి రిక్షా ఎక్కేను. హాస్పి
టల్ వైపు వెళ్తున్నాను.

బస్సులో సీటు కోసం ప్రాణాలు తీసుకునే వరకు వచ్చి ఆగి
పోయాను. బిందెడు నీళ్ళకోసం ప్రాణాలు తీసేసుకున్నారు.

నాకు తటస్థపడిన రెండు సంఘటనల్తో మనసు వికలమైంది.
మనుషులమీద అసహ్యం కలిగింది. రోడ్డుమీద వెళుతున్న రకరకాల
వ్యక్తుల్ని చూస్తుంటే రోత పుట్టింది. తీవ్రమైన అసహనానికి గుర
య్యాను ఆలోచనల మధ్య రిక్షా ఆసుపత్రి ముందర ఆగింది.

గేటుదాటి హాస్పటల్ లోపల ప్రవేశించాను. వార్డు వగైరాల
గురించి వాకబు చేస్తుండగానే మరికొందరు మిత్రులు కనిపించారు.
వాళ్ళ సహాయంతో స్నేహితుడున్న వార్డు లోపలకు చేరుకున్నాను.

దాదాపు పాతికదాకా బెడ్లు వున్నాయక్కడ. అతనిప్పుడు పలక
రిస్తే పలికే స్థితిలో లేడు. తగిలిన దెబ్బల కారణంగా కోమాలో
వున్నాడు. మధ్యమధ్యలో మూలుగుతున్నాడు ఒక్కోసారి పెద్దగా
కేకలు పెడుతున్నాడు చేతులు, కాళ్లు విసర ప్రయత్నిస్తుంటే పక్క
నున్న వారు బలవంతాన ఆపుతున్నారు.

యాక్సిడెంట్ ఎలా జరిగింది, ఎక్కడ జరిగింది వగైరా
వగైరా వివరాలడిగి తెలుసుకున్నాను.

అతడి పరిస్థితిచూసి చాల బాధకలిగింది. డాక్టర్లు వస్తున్నారు,
చూస్తున్నారు. వాళ్ళలో వాళ్ళు ఏవేవో మాట్లాడుకుంటున్నారు

"ఏం సార్....మావాడి కండిషన్ ఏమిటి" అని మాలో ఎవ
రడిగినా

"ఇప్పుడే ఏం చెప్పలేం....కనీసం రెండు రోజులు వెయిట్
చేయాలి" అని చెప్పారు డాక్టర్లు.

పరిస్థితి తెలిసే వరకూ అక్కడే వుండాలని నిశ్చయించుకు
న్నాను. కాస్సేపు మిగిలిన మిత్రులందరితో మాట్లాడాను.

పేషెంట్ బెడ్ ప్రక్కనే స్టూలొకటి లాక్కొని కూర్చున్నాను.

అతడి ముఖం వంకే చూస్తూ కూర్చున్న నాకు ఎన్నెన్నో జ్ఞాపకాలు, మరెన్నో సంఘటనలు, మా ఇద్దరి అనుభవాలు....అన్నీ ఒక్కసారిగా గుర్తొచ్చి కళ్ళు చెమరుస్తున్నై. ఉబికివస్తున్న దుఃఖాన్ని బలవంతంగా అపుకుంటూ కూర్చున్నాను. నన్ను నేనే సముదాయించుకుని నాకు నేనే సమాధాన పరచుకుని ధైర్యం కూడదీసుకుని కూర్చున్నాను.

ఒక్కసారి ఆ విశాలమైన గదినంతా పరికించి చూశాను పంకాలన్నీ మురికిపట్టి వున్నా స్పీడుగా తిరుగుతూ చక్కని గాలిప్తీస్తున్నై. అక్కడున్న పాతిక బెడ్లమీద పేషంట్లున్నారు. ప్రతి ఒక్కరి పక్కన కనీసం ఇద్దరికి తక్కువ కాకుండా సపర్యలు చేస్తూనో, కొద్దిగా కోలుకున్న వాళ్ళని పరామర్శిస్తూనో వున్నారు.

'ఎవరి హడావుడి వారిది, ఎవరి అదుర్దా వారిది, ఎవరి కష్టాలేమిటో....పాపం' అనుకున్నాను మనసులో.

"సార్ ...మీ దగ్గర బ్రెడ్ వుందా .... మా వాణ్ని కొనుక్కు రమ్మని పంపేను. ఇంకా రాలేదు. పిల్లవాడు అకలని ఏడుస్తున్నాడు. మా వాడు రాగానే అది మీరు తీసుకుందురు గాని" వెనక్కి తిరిగి చూశాను ఆ మాటలంటున్న వ్యక్తి కేసి.

"భలేవాడివయ్యా....మళ్ళీ ఇయ్యాలేంది ఈ భాగ్యానికి. పసి పిల్లాడికి అకలేస్తుంటే ఆ మాత్రం తీసుకు పెడితే ఏం పోతుంది . తీసుకో తీసికెళ్ళయ్యా పాలు కూడా వున్నయ్. పిల్లాడు తాగుతా వంటే తీసుకెళ్ళు...." అనునయంగా అంటూ బ్రెడ్ అతని చేతిలో పెట్టిందామె.

అందుకుని వడివడిగా వెళ్ళాడతగాడు.

"మీా రూ కూర్చోండి ... ఎంతసేపని నిలబడతారు పాపం" తను కూర్చున్న చిన్న స్టూల్లోనే ఓ మూలకు జరిగి పక్కనున్న

వ్యక్తిని కూర్చోమంటున్నాడు నాలుగో నంబరు బెడ్ వద్ద ఓ వ్యక్తి.

"అసలే చిన్న స్టూలు. ఇద్దరం ఏం కూర్చుంటాంలే. పరవా లేదు. మీరు కూర్చోండి".

"గంటనుంచి అలాగే నిలబడి వున్నారు. నేను ఇప్పటిదాకా కూర్చునే వున్నాగా ...మీరు కూర్చోండి పాపం....కాసేపు" అంటూ స్టూలును అతని ముందుకు తోశాడా వ్యక్తి.

కృతజ్ఞతగా చూసి కూర్చున్నాడు అప్పటివరకు నిలబడ్డవ్యక్తి.

డాక్టర్ రావడంతో లేచి నిలబడ్డాను. కుడి చేతికి వరుసగా మూడు ఇంజక్షన్‌లు చేశారు. 'సెలైన్ బాటిలివ్వండి, పెట్టి వెళ్తాను' అడిగాడు డాక్టర్. అప్పటికే అయిదు బాటిల్స్ పెట్టేశారు. ఇంకలేదు. ఎలా .. వెళ్ళి తీసుకు వచ్చే టైం లేదు. అయినా ఒకడు పరుగెట్టేడు బయటకు.

అంతలోనే ఓ యువకుడు సెలైన్ బాటిల్ డాక్టరుగారి కందించాడు. ఆయన పని ముగించుకుని వెళ్ళిపోయారు.

"మా ఫాదర్‌కని తెచ్చింది మా దగ్గర ఇంకా రెండు బాటిల్స్ వున్నయ్‌లెండి మీరు తెచ్చి ఇవ్వండి, ఫరవాలేదు" చెప్పేడతను.

కేవలం మూడు, నాలుగు గంటల్లో అక్కడున్న వాళ్ళలో సగం మంది పరిచయం అయ్యారు

వాళ్ళు ఎవరికోసం హాస్పటల్‌కి వచ్చారో....వారికి ఏంప్రమాదం జరిగిందో ...ఎలా జరిగిందో....ఏం పని చేస్తుంటారో ....ఇలాటి వివరాలన్నీ తెలిసినై. గంటకో ఇద్దరం, ముగ్గురం చొప్పున మారుతూ మిత్రుడి దగ్గర కూర్చున్నాం. మిగిలిన గంట గేటుబయట కబుర్లతో కాలక్షేపం చేస్తూ అలా అలా తెల్లవార్లూ నిద్ర పోకుండానే గడిపాం

అక్కడ వార్డులో వారంతా యాక్సిడెంట్సుకు గురైన వాళ్ళే కావడంతో మా కబుర్లన్నీ ఎక్కువ యాక్సిడెంట్స్ గురించీ, వాహనాల గురించీ, స్పీడ్ డ్రైవింగ్ గురించీ, గతుకుల రోడ్ల గురించీ, డాక్టర్ల గురించి....ఇలా....చాలా విషయాలమీద సాగింది.

మర్నాడు మధ్యాహ్నానికి మా వాడి పరిస్థితి మెరుగైందని, ప్రాణాపాయం తప్పిందని డాక్టర్లు చెప్పడంతో మేమంతా హాయిగా ఊపిరి పీల్చుకున్నాం. సంతోషంతో పొంగిపోయాం.

మిత్రుడి తల్లి, భార్య, ఆనందంతో మా దగ్గర కన్నీళ్లు పెట్టుకున్నారు. వాళ్లని ఓదార్చి, మేమంతా హోటల్లో భోజనాలు చేసి వాళ్ళిద్దరికీ కూడా పార్సిల్ తీసుకువెళ్లాం. బలవంతంగా ఆ ఆడవారిద్దరి చేతకూడా భోజనం చేయించాం. మా మాట కాదనలేక ఎంగిలి పడ్డారు వాళ్ళు. సాయంత్రానికి కొంచెం కళ్లు తెరచి చూడడం ప్రారంభించాడు మిత్రుడు.

అందరం ఆనందించాం. "నేను ఇంటికి తిరిగి వెళ్ళి ఆఫీసుకు ఓ వారం శలవు పెట్టి మళ్ళీ వస్తా" నని వాళ్ళతో చెప్పి తిరుగు ప్రయాణం అయ్యాను రాత్రి పది గంటలకు.

నాతో పాటు మరో ఇద్దరు మిత్రులు కూడా ప్రయాణమయారు.

బయల్దేరే ముందు క్రితం రాత్రి పరిచయమైన వారిక్కూడా చెప్పి వాళ్ళవాళ్ళని పరామర్శించి ధైర్యం చెప్పాను.

నా మాటలు వింటున్నప్పుడు వాళ్ళ ముఖాల్లో కనిపించిన వెలుగు నాకు కొండంత తృప్తి నిచ్చింది. హాస్పిటల్ నుంచి బయట పడ్డాం మిత్రులం ముగ్గురం. మనసులో రకరకాల ఆలోచన్లు సుడులు తిరుగుతుండగా మిత్రులిద్దరికీ వీడ్కోలు చెప్పి నేను యెక్కవలసిన బస్ యెక్కాను.

మనుషులందరూ మంచివాళ్లే ననిపించింది. అయితే .... ఆ మంచితనం, మానవత్వం, కష్టాల్లో కనిపిస్తున్నది. సుఖాల్లో కనుమరుగవుతున్నది అనిపించింది.

కష్టాల్లో మనుషులు మనుషుల్లాగే వుంటూ సుఖాల వేటలో మాత్రం మృగాలై పోతున్నారు! కష్టాలే కోరుతుందామా ? సుఖాలు కూడా కలసికట్టుగా పంచుకుందామా ?

మనుషులమైతే ఎప్పుడూ మనుషులుగానే వుందాం. ★